వాడవాడలా కొలువుదీరిన గణనాథులు



పులివెందుల : అమ్మవారిశాల వీధిలో కొలువుతీరిన గణనాథుడు



కమలాపురం గ్రామ చావడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని భారీ విగ్రహం



పులివెందుల : గాడిచర్లవారివీధిలో కొలువుతీరిన పరమేశ్వర గణనాథుడు



ముద్దనూరులో కొలువుదీరిన గణనాథుడు



వీరపునాయునిపల్లెలో పూజలందుకుంటున్న..

పులివెందుల టౌన్ : పట్టణంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణ ప్రజలు ఘనంగా చవితి వేడుకలు జరుపుకున్నారు. పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. స్థానిక వినాయకస్వామి ఆలయంలో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద వినాయకస్వామిని భక్తులు దర్శించుకుని కాయ, కర్పూరాలు సమర్పించి పండ్లు, పూలు నైవేద్యంగా సమర్పించారు. బలిజ సంఘం కార్యాలయం వద్ద కొలువుతీరిన వినాయక విగ్రహం వద్ద ఆర్కెస్ట్రా నిర్వహించారు. మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. యర్రగుడిపాళెం వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పండుగరోజు నుంచి మూడురోజులపాటు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిశాల వీధిలోని వాసవిగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పులివెందుల రూరల్ : పట్టంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులోని 21 వార్డులో వార్డు కౌన్సిలర్ కోడిరమణ ఏర్పాటు చేసిన వినాయకుని భారీ విగ్రహ వేడుకల్లో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహరరెడ్డి వైఎస్సార సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్పలు పాల్గొన్నారు. అలాగే శ్రీరామాహాలు వద్ద బాలాజీ మార్టు వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో వినాయక చవతి వేడుకలను నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని క్రాస్‌రోడ్డు, గ్రామచావిడి, శీలావీధి, బ్రాహ్మణవీధి, పక్కీరువాడ, కృష్ణానగర్, పాత కచ్చేరి వీధులతో పాటు మండలంలోని కె.అప్పాయపల్లె, చదిపిరాళ్ల, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, సి.రాజుపాళెం, నల్లింగాయపల్లె, పందిళ్లపల్లె, కోగటం, సంబటూరు, గంగవరం, దేవరాజుపల్లె తదితర గ్రామాల్లో వివిధ ఆకారాలతో గణనాధులు కొలువు దీరారు. ఉదయం నుంచే భక్తులు తలస్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి పెద్ద సంఖ్యలో గణనాధులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అన్నదానాలు ఏర్పాటు చేశారు. వినాయకుని చేతిలో ఉంచిన లడ్డూలకు వేలం పాట నిర్వహించారు. భక్తులు పోటీపడి వేలం పాటలో లడ్డులు దక్కించుకున్నారు. పట్టణంలోని కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాలను ఆదివారం నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జనంలో యువత వివిధ రకాల నృత్యాలు నిర్వహిస్తూ ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగంపు నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలో వాడ వాడలా వినాయక విగ్రహాలను నిలబెట్టారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మహిళలకు ముగ్గులపోటీలను నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్నెలూరు, నేతాజీ నగర్ ప్రాంతాలో రెండు రోజులుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి లడ్డులకు వేలం నిర్వహించారు.

జమ్మలమడుగు రూరల్ : మండలంలో 130 విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. సోమవారం 70 విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పెద్దముడియం మండలం పాలూరు గ్రామం వద్ద కూందున దిలో నిమజ్జన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా వాడ వాడలా వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నాదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం నిమజ్జనం కావడంతో ఎస్ఐ నాగప్రసాదు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

లింగాలలో..

లింగాల : మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్త శ్రద్దలతో జరపుకున్నారు. వాడవాడలో ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయాకుడు చంద్రశేఖరరెడ్డి ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా గ్రామాలలో వాడవాడల వినాయకుని ప్రతి మలు కొలువు తీరాయి. ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి వినాయకుని ప్రతిమలు కొలువు తీర్చారు. పండుగను పురష్కిరించుకుని అన్ని చోట్ల వినాయక ప్రతి మలకు భక్తశ్రద్దలతో భక్తులు పూజలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల, కలమల్ల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మొత్తం 160 విగ్రహాల ప్రతిష్టకు పోలీస్‌శాఖ అనుమతులిచ్చింది. మండపాలను వైభవంగా తీర్చిద్దికుని గణనాథులను ప్రతిష్ఠించారు. పట్టణంలోని నడివురులోని విగ్రహం, మహేశ్వనర్ కాలనీలో ఉన్న విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముద్దనూరులో

ముద్దనూరు : మండపాల్లో శనివారం తెల్లవారుజామునుంచే మండపాల్లో కొలువు దీరిన వినాయక ప్రతిమలకు ఘనంగా పూజలు చేశారు. ఇష్టమైన వంటకాలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 93 వినాయకుని ప్రతిమలను ప్రతిష్టించి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు కుటుంబ సభ్యులతో కలసి విగ్రహాల వద్దకు వెళ్లి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపిస్తున్నారు. వినాయకుని ప్రతిమల వద్ద ఆటల పోటీలు, డ్యాన్స్ పోటీలు ఏర్పాటు చేయగా పోటీల్లో చిన్నారులు, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిమజ్జన కార్యక్రమం ఆదివారం, సోమవారం నిర్వహించనున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వేంపల్లిలో

వేంపల్లి : మండల వ్యాప్తంగా చలువ పందిర్లను వేసి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. శనివారం వినాయక చవితి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక జడ్పీటీసీ రవి కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రి వినాయక చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక అలంకరణ చేశారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని పలు గ్రామాల్లో శని, ఆదివారం రెండు రోజులపాటు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉదయాన్నే అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు.



సింహాద్రిపురంలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



లింగాలలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు



ఎర్రగుంట్ల : నడివూరులో వినాయక విగ్రహం



వైఎస్ మనోహరరెడ్డిని సన్మానిస్తున్న వినాయక కమిటి సభ్యులు



వేంపల్లెలో ప్రత్యేక అలంకరణలో గణపతి



జమ్మలమడుగు : నేతాజీనగర్‌లో కొలువైన వినాయక విగ్రహం

క్లుప్తంగా

ప్రారంభమైన శ్రీరంగనాథుడి పవిత్రోత్సవాలు



హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణ సమీపంలోని అతి పురాతన శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలుపూజ పవిత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీరంగనాథుడు సతీసమేతుడై హనుమంతుని వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ రమణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కృష్ణరాజేష్ శర్మ శ్రీరంగనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. ప్రతి ఏడాది వినాయక చవితి మరుసటి రోజు నుంచి 9 రోజుల పాటు శ్రీరంగనాథుని ఆలయంలో నూలుపూజ పవిత్రోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలి వస్తారు. భక్తులకు ఆలయంలో ఎటువంటి సమస్యలు లేకుండా పర్యవేక్షించారు.

అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో, పూలమాలలతో అలంకరించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను పరిశీలించి అందుబాటులో ఉంచారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు కానుకలను ముడుపులను సమర్పించుకుని ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో భోజనాలను చేశారు. అలాగే ఆలయ ఆవరణలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి

కమలాపురం : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాల నిమజ్జనంలో తాము సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్దకు ఉత్సవ కమిటీ పిలుపు మేరకు ఆయన హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్న పిల్లలను, వృద్ధులను, మహిళలను నిమజ్జన ప్రాంతానికి తీసుకెళ్లరాదన్నారు. అలాగే ఊరేగింపు సమయంలో విద్యుత్ వైర్లను గమనించుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వెళ్లాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా ఈ నిబంధనలు పాటించి నిమజ్జనం పూర్తి చేసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు ఎస్ఐను సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం

వేంపల్లె : ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా)ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించామని అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకటసునీల్‌కుమార్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కడపకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ క్రిష్టిపాటి వెంకట శేషపాణి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు అందించారు. దాదాపు 102 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. కొన్ని సంవత్సరాలుగా అవోపా ద్వారా సేవే లక్ష్యంగా పేదలకు వివిధ రకాల వైద్య సేవలతో పాటు ఇతరత్రా సేవలు అందిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రవీణ, గౌరవాధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యక్షుడు ద్వారకానాథ్, ఈసీ సభ్యులు అవోపా మహిళా విభాగ్ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : విజయవాడ వరద బాధితులను ఆదుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని డీవైఎఫ్ఐ మాజీ నాయకులు శివనారాయణ, డీవైఎఫ్ఐ కార్యదర్శి శివకుమార్‌లు తెలిపారు. ఆదివారం వరద బాధితుల సహాయార్థం పట్టణంలో విరాళాలు సేకరించారు.

అభివృద్ధిలో సంపూర్ణ అక్షరాస్యత పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య

వల్లూరు : సమ్మిళిత సుస్థిర అభివృద్ధి సాధనలో సంపూర్ణ అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మండల స్పెషలాఫీసర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. 58వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ సందర్భంగా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఇప్పటికీ 20 శాతం పైబడి నిరక్షరాస్యులు వున్నారన్నారు. డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, కళాక్షరాస్యత, సామాజిక అక్షరాస్యతల్లో నాణ్యత పెరగడానికి సంపూర్ణ అక్షరాస్యత దోహదం చేస్తుందని వివరించారు. అక్షర జ్ఞానం ద్వారా సమాజంలో రాణించవచ్చు అన్నారు. వయోజన విద్య ఉపసంచాలకులు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి ఇళ్లలో చదువురాని వారు ఉన్నట్లయితే వారికి తప్పనిసరిగా ప్రతి రోజు ఒక అర గంట సమయం కేటాయించి చదవడం రాయడం నేర్పించాలన్నారు. డిజిటల్ విద్య, ఆర్థిక అక్షరాస్యతలో మెళకువలు తెలుసుకుని రాణించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీసీడీవో విజయ లక్ష్మి, వెలుగు ఏపీఎం శైలజ, ఎంఈవో- 2 విజయారెడ్డి, ప్రిన్సిపాల్ నసీమున్నీసా, ఏపీవో రమాదేవి, పర్యవేక్షకులు రామచంద్రారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పండుగకు వెళ్తూ..

- బైక్‌ను ఢీకొన్న ఆల్విన్ వాహనం
- తల్లీకొడుకు మృతి



మృతి చెందిన కాంతమ్మ

ఆళ్లగడ్డ: వినాయక చవితికి సొంతూరుకు బయలుదేరిన తల్లీకొడుకు మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డారు. ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల.. మేరకు వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం నందిపల్లె గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకట కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్ ప్రాంతంలో తోటలకు కాపలా ఉంటూ జీవనం పొందుతున్నాడు. వినాయక ఉత్సవాల సందర్భంగా వెంకటకృష్ణారెడ్డి ముందుగానే సొంతూరుకు వెళ్లాడు. శనివారం సాయంత్రం షాద్‌నగర్ నుంచి అతని భార్య కాంతమ్మ (37) కొడుకు జగదీశ్వర్‌రెడ్డి (17) కూడా సొంతూరుకు ప్రయాణమయ్యారు. కాగా అదే సమయంలో వెంకటకృష్ణారెడ్డి కుటుంబానికి పరిచయం ఉన్న సుబ్బారావు షాద్‌నగర్ నుంచి వేంపల్లెకు బైక్‌పై వస్తుండటంతో వారిద్దరూ అదే బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో ఆళ్లగడ్డ సమీపంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలోకి వచ్చేసరికి పెబ్బేరు నుంచి కడపకు వెళ్తున్న ఆల్విన్ వాహనం వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జగదీశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కాంతమ్మను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బైక్ నడుపున్న సుబ్బారావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల ద్వారా ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలతల దేవస్థానం ఉద్యోగి మధుబాబు మృతి

పెండ్లిమర్రి : పొలతల దేవస్థానం నందు పనిచేస్తున్న జి.మధుబాబు(40)(భజంత్రి)అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మధుబాబు కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడతూ ఉండేవాడు. ఆదివారం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి ఆలయ ఈఓ కృష్ణానాయక్ అంత్యక్రియలకు దేవస్థానం తరుపున రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

వినాయకుడి నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీ నాయక్, సీఐలు

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలోని వినాయక చవితి వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపు కోవాలని డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. ఆదివారం వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో ఆయన అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్లే టప్పుడు కులమతాలకు అతీతంగా భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమానికి వెళ్లాలన్నారు. నిమజ్జనానికి వెళ్లే రహదారులలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విగ్రహాలను తీసుకెళ్లేటప్పుగు ట్రాక్టర్లు, కండీషన్‌లో ఉన్నాయా లేదా చూసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలు, డ్యాన్స్‌లు వుండకూడదన్నారు. కార్యక్రమంలో సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 5 ఆయా, ఒక వర్కర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వసంతాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14వ వార్డు 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టును భర్తీ చేసేందుకు రోస్టర్ ప్రకారం ఎస్సీ అభ్యర్థినికి కేటాయించామన్నారు. వల్లూరు మండలం చిన్నపుత్తలో ఆయా (బీసీ-సీ), కొప్పోలు మెయిన్ సెంటర్‌లో ఆయా (బీసీ-ఎ) అభ్యర్థులకు రోస్టరు ప్రకారం కేటాయించా మన్నారు. అలాగే వీరపునాయునిపల్లె మండలం తంగేడుపల్లె ఆర్అండ్ఆర్ కాలనీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు భర్తీ చేయడానికి రోస్టర్ ప్రకారం (ఎస్సీ), నేల తిమ్మాయపల్లె-ఆయా, రోస్టర్ (ఎస్టీ), వేలుదుర్తి-ఆయా రోస్టర్ (ఓసీ)కు కేటాయించామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై, 2024 జూలై 1 నాటికి 21 సం. పూర్తి అయి, 35ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని ఆమె తెలిపారు. టెన్త్ క్లాస్ ఉత్తీర్ణులైన వారు లేని పక్షంలో అంతకన్న తక్కువ విద్యార్హత ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈనెల 17వ తేదీ లోపు దరఖాస్తులను ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి

వేంపల్లె : సమాజాభివృద్ధికి తమవంతుగా కృషిచేస్తున్న జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులు రాష్ట్ర కార్యదర్శి పల్లెటి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో ఏపీయూడబ్ల్యూజే మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల కమిటీ అధ్యక్షుడిగా వి.రఘునాథ్‌రెడ్డి, కార్యదర్శి బి.జయచంద్ర, కోశాధికారిగా జీఎస్.ఖదీర్‌తో పాటు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజానీకానికి వారధిగా కృషి చేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముందు వరుసలో ఉంటామన్నారు. అలాగే జర్నలిస్టులందరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయిస్తామని వేంపల్లె టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని చెప్పడం హర్షణీయమని జర్నలిస్టు స్పోర్ట్స్ రాష్ట్ర కన్వీనర్ బి.శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ఎం.రవికుమార్‌రెడ్డి, వేంపల్లె సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, ఎస్ఐ తిరుపాల్‌నాయక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా, ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు బి.శివకేశవరెడ్డి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

మండల పాత్రికేయ సంఘం ఎన్నిక

ముద్దనూరు : మండలం పాత్రికేయుల నూతన కార్యవర్గ సంఘం ఆదివారం ఎన్నికైంది. ప్రింట్ మీడియా మండల కమిటీ ఎన్నికలో భాగంగా ఏకగ్రీవంగా నూతన కమిటీ ఏర్పాటైంది. మండల పాత్రికేయ సంఘం అధ్యక్షుడిగా బి.కృష్ణమోహన్, గౌరవ అధ్యక్షుడిగా రఘు, ఉపాధ్యక్షులుగా ఏసుదాసు, బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ బాబు, కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా నందకుమార్, శివ శంకర్‌లు ఎన్నికయ్యారు.